క్లుప్తంగా

సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతి



భట్టి విక్రమార్కను కలిసిన డాక్టర్ రామనాథం కుటుంబ సభ్యులు

మధిర: మధిర నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఆదివారం రామనాథం తన కుటుంబ సభ్యులతో భట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ వాసిరెడ్డి సతీష్, డాక్టర్ వాసిరెడ్డి సమత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ నామాను కలిసిన కౌన్సిలర్లు



ఎంపీ నామాకు పూలమొక్కను అందిస్తున్న మధిర మున్సిపల్ కౌన్సిలర్లు

మధిర: ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత నామ నాగేశ్వరరావును బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మధిర మున్సిపల్ కౌన్సిలర్లు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధి పనులతో పాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఎంపీతో చర్చించారు.టీ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో కౌన్సిలర్లు వైవీ అప్పారావు, అరిగె రజిని, ధీరావత్ మాధవి, మేడికొండ కల్యాణి, గద్దల మాధురి, కర్నాటి భారతి, సయ్యద్ ఇక్బాల్‌తో పాటు నాయకులు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

కల్లూరు రూరల్: కల్లూరు మండలం దారుగబంజరు గ్రామానికి చెందిన తుమ్మల అభిమాన సంఘం నాయకులు షేక్ ఖాదర్, ఏలూరి శ్రీరాం, ఎస్‌కె సిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిరిశాల నరసింహారావు, పొట్రు సత్యం, మందడపు సుమంత్, ఎస్‌కె.షమీ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పరామర్శ



అంకసాల రాజేశ్వరిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఎర్రుపాలెం: మాజీ జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు సతీమణి రాజేశ్వరి(45) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి మాధురి ఆస్పత్రికి చేరుకుని ఆమెను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు వాసిరెడ్డి శివకుమారి, మున్నలూరి మురళీధర్, లాజర్, కొప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, సీతారామరాజు, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

ఈవెంట్లకు అనుమతి లేదు

వైరా: నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు వైరా నియోజకవర్గ వ్యాప్తంగా ఈవెంట్లకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ తెలిపారు. ఆదివారం వైరాలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా నూతన సంవత్సర ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు.. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూ ఇయర్ సందడి

- కేక్‌లు, స్వీట్లు, బిర్యానీలకు ఫుల్ గిరాకీ
- రంగవల్లులతో మహిళలు బిజీ
- యువత కేరింతలు

సాక్షి నెట్‌వర్క్: న్యూ ఇయర్ రానే వచ్చింది.. యువత ఉరకలేస్తూ కొత్త సంవత్సరం 2024కు ఘనంగా స్వాగతం పలికింది. ఆదివారం మధ్యాహ్నం నుంచే అన్ని మండలాల్లో కేక్‌లు, బిర్యానీ దుకాణాలు, స్వీట్లు, రంగుల దుకాణాలు కొనుగోళ్లతో సందడి నెలకొంది. ప్రజలు నూతన వస్త్రాలు ధరించేందుకు వస్త్రదుకాణాలు కిటకిటలాడాయి. ప్రజలు ఉత్సాహంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మద్యం దుకాణాల వద్ద మందు బాబులు బారులు తీరారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి న్యూఇయర్ వేడుకలు జరుపుకున్నారు.

న్యూ ఇయర్ కళ..

కేక్‌లు కట్ చేయడం.. బాణాసంచా కాల్చటం.. నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ న్యూ ఇయర్‌ను స్వాగతిస్తూ జోష్‌లో యువత సందడి చేసింది. కొందరు యువకులు బైక్‌లను అతివేగంగా సైలెన్సర్‌లను తొలగించి మరీ నడుపుతూ ఆనందంలో మునిగిపోయారు. ప్రధాన రహదారుల వెంట ప్రత్యేకంగా టెంట్లు వేసి మరీ స్వీట్లు, కేకులు, రంగుల అమ్మకాలు జోరుగా సాగాయి. మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తమ ఇళ్లముందు అందమైన రంగవల్లులతో అలంకరించారు.



సత్తుపల్లిటౌన్: కేక్‌ల దుకాణం వద్ద కొనుగోళ్లు చేస్తున్న ప్రజలు



సత్తుపల్లిలో స్వీట్ దుకాణం వద్ద..



తల్లాడలో..



చింతకాని: నాగులవంచలోని శ్రీ ఆదర్శ విద్యాలయంలో..



కొణిజర్ల: సమత సూపర్‌జెమ్స్ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా మొక్క పోచమ్మకు బోనాలు



ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట గ్రామంలో ఆదివారం మొక్క పోచమ్మ తల్లి 7వ వార్షికోత్సవం సందర్భంగా పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామంలో మహిళలు వివిధ రకాల పిండివంటలు తయారు చేసుకొని బోనంతో ఊరేగింపుగా కాటన్ పార్క్ వద్ద ఉన్న మొక్క పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనేక ప్రభలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆలయం వద్ద పోచమ్మకు పసుపు, కుంకుమతో పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు అనిపెద్ది సుబ్రమణ్య శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కళాకారుల వన సమారాధన

మధిర: ఆత్కూరు మామిడి తోటలో ఆదివారం శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి కళాకారుల వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో కళాకారుల వన సమారాధన నిర్వహించి సహపంక్తి భోజనాలు, కళాకారులను సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాకారులను ఘనంగా సన్మానించారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు శ్రీకృష్ణ ప్రసాద్, టీవీ రెడ్డి, శ్రీనివాసరావు, బాబ్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండబాల కోటేశ్వరరావు

విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం



వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొణిజర్ల: విశ్వ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని పెద్ద రామాపురం సమీపంలోని మామిడితోటలో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హాజరై మాట్లాడారు. విశ్వకర్మల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొణిజర్ల సర్పంచ్ రామారావు, విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నాగేంద్రాచారి, మండల అధ్యక్షుడు రామకృష్ణాచారి, సైదాచారి, దామోదరాచారి, విష్ణుచారి, సత్యనారాయణచారి, శ్రీనివాసచారి, కోటాచారి తదితరులు పాల్గొన్నారు.

వైరాలో టీ జేఏసీ సమావేశం



మాట్లాడుతున్న టీ జేఏసీ చైర్మన్ పాషా

వైరా: వైరాలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం పూర్ణకంటి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారులను గుర్తిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో పొందుపరిచినందుకు గాను ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరిని ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులకు ఇంటి స్థలంతో పాటు గౌరవ వేతనం కూడా అందించాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఉద్యమ కారుడు మెండెం ఇసాక్ బాబుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్‌కే పాషా, అర్జునరావు, వరదరాజు, నరసింహారావు, కుమార్, దర్గయ్య, శ్రీను, బాబు, రాఘవరావు, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

సురేష్ సేవలు అభినందనీయం

ఏన్కూరు: దివ్యాంగులకు బస్‌పాసులు అందించడానికి సాయమందించిన జాగర్లమూడి సురేష్ సేవలు అభినందనీయమని ఎస్సై బాదావత్ రవి అన్నారు. మండల కేంద్రంలో సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ఉచితబస్ మేళాను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తన సొంత ఖర్చులతో 130 మంది దివ్యాంగులకు బస్‌పాసులు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది శాంసన్, సురేష్, ఆనందరావు, బాబు పాల్గొన్నారు.

పవన్‌కుమార్..

కల్లూరు: కరోనా సమయంలో సేవలు అందించిన పలు శాఖలకు కొత్త నారాయణపురానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ చుండూరు పవన్ కుమార్ అభినందనలు తెలిపారు. పోలీస్, పత్రిక, వైద్య, ఆరోగ్య, పారిశుద్ధ్య సేవలను కొనియాడారు. కేవలం ప్లాస్టిక్ బాల్, గుండు సూదులు, అయస్కాంతం, భూతద్దం, వేస్టేజ్ ఇయర్ ఫోన్స్ కేబుల్, ఇయర్ బడ్స్, డోర్ స్టాపర్‌లను ఉపయోగించి వినూత్నంగా సమూనాను తయారు చేశాడు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

పెనుబల్లి: మండలంలోని పెనుబల్లి హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వైరాకు చెందిన ఆర్ హనుమంతురావు అనారోగ్యంతో శనివారం రాత్రి ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, టీఎస్‌యూటీఎఫ్ సంఘం సభ్యులు వి.నాగేమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరితో పాటు తోటి ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, ఎస్‌కె రంజాన్, ఎ.సుధాకర్, వీవీ రామారావు, మండల నాయకులు జి.వీరస్వామి, ఎస్‌హెచ్ ప్రసాద్, బి.కృష్ణారావు, జి.హన్మంతు, కేఎస్ఎస్ రాజు, వి.తిరుపతిరావు, ఆర్‌వీఆర్ చారి, వి.రవికుమార్, ఎం.జె. సుధీర్, సురేష్ తదితరులు ఆర్ హనుమంతురావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించి, కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కాకి వెంకటేశ్వరరావు(45) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. వెంకటేశ్వరరావు పార్థివ దేహాన్ని ఎంపీడీఓ జయరాం, పంచాయతీ కార్యదర్శి రవి మోస్తూ నివాళులర్పించారు. సర్పంచ్ చెట్టుమాల రేణుక, పాసెం ఈశ్వర్, ఎంపీటీసీ సభ్యురాలు పాలకుర్తి సునీత, రాజులు వెంకటేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

3న శోభాయాత్ర

మధిర: అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం మొదటి దశ పూర్తైన సందర్భంగా స్వామివారి అక్షింతలను భక్తులకు అందించడం జరుగుతుందని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ మధిర సహ సంయోజక్ మాదిరాజు దుర్గాప్రసాద్, శివరాజు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మధిర పట్టణంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 3న మధిర పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి రైల్వే గేట్ వరకు, అక్కడనుంచి కృష్ణ మందిరం వరకు మంగళ వాయిద్యాలతో శ్రీరామ నామ స్మరణతో ఉదయం 10 గంటల నుంచి శోభాయాత్ర కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 4 నుంచి అక్షింతలు, కరపత్రం, అయోధ్య మందిర చిత్రపటం భక్తుల ఇళ్లకు వెళ్లి ముందుగా నిర్ణయించుకున్న ప్రణాళిక ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులతో సీఐ జె.మోహన్‌బాబు, ఎస్సై శ్రావణ్‌కుమార్

సత్తుపల్లిటౌన్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని సత్తుపల్లి సీఐ జె.మోహన్‌బాబు అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎస్సై శ్రావణ్‌కుమార్‌తో కలిసి సందర్శించి కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహం నింపారు. యువత క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ్, వంశీ, అర్వపల్లి సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

వైరా: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.2 లక్షలు రుణమాఫీ, రైతు భరోసా సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా రూ.15 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, రాయల వెంకటేశ్వర్లు, వాసిరెడ్డిప్రసాద్, చింతనిప్పు చలపతిరావు, మాజీ ఎంపీపీ సమత, నరసింహారావు, పకీరమ్మ, గంగాధర్, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సత్తుపల్లిరూరల్: వేంసూరు మండల భీమవరం గ్రామానికి చెందిన జగదీష్ అనే యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సత్తుపల్లి ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఉబ్బల వెంకటేశ్వరరావు అందించారు. ఈ సంఘటన సత్తుపల్లి మండలం సదాశివునిపేట గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న జగదీష్ సత్తుపల్లి వస్తుండగా మార్గమధ్యలో.. సదాశివునిపేట వద్ద తన జేబులో నుంచి సెల్‌ఫోన్ పడిపోయింది. అటుగా వెళ్తున్న ఫైర్ స్టేషన్ ఉద్యోగి వెంకటేశ్వరరావుకు సెల్‌ఫోన్ కన్పించటంతో దానిని తీసుకొని జగదీష్‌కు సమాచారం అందించి సెల్‌ఫోన్‌ను అప్పగించాడు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



సత్తుపల్లి: నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: నూతన సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం మందిరంలో ఆదివారం ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మీ అందరి సహకారం మరువలేనిదని.. ఈ ఆదరాభిమానాలతోనే గెలిపించి మట్టా కుటుంబానికి అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. న్యూఇయర్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సీఎస్ఈ హెల్త్‌కేర్ వారు కార్మికశాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఉన్నవారికి 56 రకాల రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి అభినందనలు తెలిపారు. ముందుగా బేతుపల్లి అంకమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సత్తుపల్లిశాఖ ఆధ్వర్యాన ఎమ్మెల్యే రాగమయికి వేద ఆశీర్వచనం అందించారు. ఏఐటీయూసీ సింగరేణి రాష్ట్ర ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మట్టా దయానంద్, అలవాల లక్ష్మి, తడికమళ్ల ప్రకాశరావు, పింగళి సామేలు, పింగళి సామేలు, ఎండీ కమల్‌పాషా, కోటమర్తి రమేష్, కొడిమెల అప్పారావు, ఊట్కూరి వినోదరావు, ఎంఎస్ఆర్ శర్మ, మాదిరాజు పుల్లారావు, వేణు పాల్గొన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ..

కల్లూరు: వృద్ధులకు, వికలాంగులకు కల్లూరు శాంతినగర్‌లో శాంతినగర్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు అందించిన దుప్పట్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌డీఎస్ వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మధిర ద్డుడ్‌లోని డంపింగ్‌యార్డ్‌ను తొలగించాలని, శాంతినగర్‌లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఎస్‌డీఎస్ అధ్యక్షులు ఖమ్మంపాటి వీరయ్య, ఉపాధ్యక్షుడు కేవీ, కార్యదర్శి ఖమ్మంపాటి శ్రీనివాసరావు, ఫాస్టర్ సత్యానందం, కృష్ణకుమారి, అనూష, శ్రీరాములు, కేజియ, జయరాజు, ఉపేంద్ర, వీరేందర్, కిషోర్, సీతారాములు, సీతారాములు పాల్గొన్నారు.

కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

- చట్టబద్ధంగానే భూమిని కొనుగోలు చేశాం
- విలేకరుల సమావేశంలో ఆర్టీఐ మాజీ కమిషనర్



మాట్లాడుతున్న ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్

కారేపల్లి: కావాలని.. కొంతమంది మాపై తప్పుడు ఆరోపనలు చేస్తున్నారని ఆర్టీఐ మాజీ కమిషనర్ గుగులోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లి మండలం ఆలియాతండా గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉసిరికాయలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 548లో పచ్చిపాల సోమయ్య అనే వ్యక్తి నుంచి మా కుటుంబ సభ్యురాలైన బానోత్ లక్ష్మి పేరుతో 4 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశామని.. దీనికి సంబంధించి 2022 సంవత్సరంలో పట్టాదారు పాసుబుక్కులు సైతం మంజూరైయ్యాయన్నారు. ఇప్పుడు ఆ భూమిలో 1.20 ఎకరలు తమదంటూ.. పచ్చిపాల భద్రయ్య, భాగ్యమ్మ, ఆకాశ్ లతో పాటు మరికొంతమంది వ్యక్తులు వచ్చి ఫెన్సింగ్, పామాయిల్ మొక్కలను నాశనం చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్, గుగులోత్ సాలమ్మ, గుగులోత్ భగ్యా, బానోత్ లక్ష్మి, బానోత్ బుజ్జి లు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మత్కేపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్న అధికారులు

చింతకాని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని మత్కేపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు ప్రతి ఒక్కరికీ చేరుకోవాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, గరీబ్ కల్యాణ్, ఆవాస్ యోజన, జీవన జ్యోతి బీమా యోజన, ఉజ్వల యోజన వంటి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి పథకాలకు సంబంధించి అర్హులను గుర్తించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు తిరుపతి కొండలరావు, ఆలస్యం నాగయ్య, ఎంపీటీసీ సభ్యులు తిరుపతి భాగ్యలక్ష్మీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పడిశాల బాబురావు, వినోద్‌కుమార్, ఐకేపీ, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.


వాసవీక్లబ్ గ్రేటర్‌కు అంతర్జాతీయ బెస్ట్ అవార్డు

సత్తుపల్లిటౌన్: వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్‌కు అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్‌క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుల కార్యక్రమంలో ఈ అవార్డులను అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి చేతుల మీదుగా వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ అధ్యక్షుడు పోకూరి కృష్ణప్రసాద్ అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్‌ను పట్టణ ప్రముఖులు మట్టా ప్రసాద్, వందనపు సత్యనారాయణ, గుండు ఉమామహేశ్వరరావు, రేపాకుల శ్రీను, పోలిశెట్టి శివకుమార్ అభినందించారు.



అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న సత్తుపల్లి గ్రేటర్ అధ్యక్షుడు పోకూరి కృష్ణప్రసాద్

ఆర్యవైశ్య మండల నూతన కమిటీ ఎన్నిక



మిట్టపల్లి నరేంద్రకుమార్

పెనుబల్లి: పెనుబల్లి మండల ఆర్యవైశ్య కల్యాణ మండపం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా విజయలక్ష్మి ఫ్యాన్సీ యజమాని మిట్టపల్లి నరేంద్ర కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి, తనను రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లూరు: కల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పసుమర్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆర్యవైశ్య మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కమిటీ అధ్యక్షుడిగా అనుమోలు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దారా రంగా, కోశాధికారిగా మైలవరపు శ్యామ్, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా చలువాది నగేష్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా దారా సురేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పసుమర్తి చందర్‌రావు, గుర్రం శ్రీనివాసరావు, అంజయ్య, మోహనరావు, రాఘవరావు, రాంబాబు, వీరబాబు, కృష్ణారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు: నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

ట్రస్మా వైరా డివిజన్..

వైరా: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) వైరా డివిజన్ నూతన కమిటీని ఆదివారం వైరాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైరాలోని ఠాగూర్ విద్యాలయంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ నూతన అధ్యక్షుడిగా బోడేపూడి కిరణ్ (ఆదర్శ విద్యాలయం, నాగులవంచ, చింతకాని), కార్యదర్శిగా జొనెబోయిన నరసింహారావు (మిలీనియం పాఠశాల, తనికెళ్ల), కోశాధికారిగా టికే ప్రసన్నన్ (యూనివర్సల్ స్కూల్, తల్లాడ)లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కాంతారావు, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి నాసారయ్య, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు మదీన్, వైరా డివిజన్ నాయకులు సంక్రాంతి రవికుమార్, కొణతం ఉమాశంకర్, నల్లబోలు మాధవరెడ్డి, షేక్ హుస్సేన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రస్మా వైరా డివిజన్ నూతన కమిటీ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | ఖమ్మం-1 కె. సురేష్ - 90631 99777
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | మధిర వీరబాబు - 98498 64638
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642